
అంబరాన్నంటేలా.. కనుల విందు చేసేలా


రాజంపేట టౌన్‌: గాంధీసర్కిల్‌లో వేసిన భారీ సెట్టింగ్‌


సంబేపల్లె: దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం వద్ద..

సాక్షి, నెట్‌వర్క్‌: శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. రాజంపేట పట్టణంలోని అమ్మవారిశాల, సంబేపల్లె మండల కేంద్రంలో వెలసిన దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా ఉమ్మడి వైఎస్సార్‌ జిల్లాలో ప్రొద్దుటూరు తర్వాత రాజంపేటలోనే ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తుంటారు. ఇప్పటికే కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలలో ప్రతి రోజూ అమ్మవారిని ఒక్కో అలంకరణలో భక్తులు దర్శించుకోనున్నారు. పట్టణంలో పలు కూడలిలో అమ్మవారి ప్రతిమలను విద్యుత్‌ దీపాలతో ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రందే నాగసత్యనారాయణ గుప్తా తెలిపారు.


రాజంపేట టౌన్‌: ఏర్పాటు చేసిన వాసవీమాత ప్రతిమ

అక్రమ రవాణా మానవాళికే ప్రమాదం


జెండాను ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న హరినాథరెడ్డి

రాయచోటి టౌన్‌ : మానవ అక్రమ రవాణా మానవాళికే ప్రమాదమని ఎస్‌డీహెచ్‌ఆర్‌ డిగ్రీ కళాశాల చైర్మన్‌ హరినాథరెడ్డి, వీఆర్‌డీఎస్‌ సురేంద్రరెడ్డి అన్నారు. శనివారం ఎస్‌డీహెచ్‌ఆర్‌ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలసి మూమెంట్‌ ఇండియా, గ్రామ జ్యోతి సొసైటీ వారి సహకారంతో వాక్‌ ఫ్రం ఫ్రీడం కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో దోపిడీ, బలవంతపు శ్రమ, బానిసత్వం, బిక్షాటన వంటి రూపాలలో మాదక ద్రవ్యాలు, ఆయుధాల అక్రమ రవాణ జరుగుతోందన్నారు. దీని తరువాత స్థానం అక్రమ మానవ రవాణదేనన్నారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోరాటం సాగించాలన్నారు.

హిందూ సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

రామాపురం : హిందూ సనాతన ధర్మాన్ని కాపాడుకుందామని లక్కిరెడ్డిపల్లె మార్కెట్‌ యార్డు చైర్మన్‌ విశ్వనాథరెడ్డి, మాజీ మార్కెట్‌ యార్డు చైర్మన్‌ రమేష్‌రెడ్డి, సర్పంచ్‌ నాగభూషన్‌రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రలంలోని హరిహరాలయం నుంచి విశ్వహిందూ పరిషత్‌ రథయాత్రను ప్రారంభించారు. మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, అన్ని ప్రాంతాల్లో దేవాలయాలను హరినామ కీర్తనలు ఆలపించాలని భక్తులకు సూచించారు. ప్రజల్లో భక్తిభావం పెంపొందించాలన్నారు. హిందూదేవాలయాల అభివృద్ధికి, దూపదీప నైవేద్యాలకు, పురోహితులకు పారితోషికం, హరినామ సంకీర్తనలు చేసేవారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని సూచించారు. మూడు రోడ్ల కూడలి వరకు రథాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి భజన కార్యక్రమాలను నిర్వహించారు. మండల పరిధిలోని గువ్వలచెరువు, చిట్లూరు తదితర ప్రాంతాల్లో కొనసాగింది. రాచపల్లె గ్రామంలోని కొవ్వూరువాండ్లపల్లె వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణ, పెద్దిరెడ్డి ఆదినారాయణరెడ్డి, కిరణ్‌కుమార్‌, వీరారెడ్డి, భాస్కర్‌రెడ్డి, దామోదర్‌నాయుడు, ప్రసాద్‌రెడ్డి, అంజనారెడ్డి, క్వారీ భాస్కర్‌రెడ్డి, నేతలు, భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

19 నుంచి బ్రహ్మోత్సవాలు

రాజంపేట టౌన్‌ : మండలంలోని చుండువారిపల్లె గ్రామంలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 19వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. 19న సాయంత్రం 5 గంటలకు ప్రముఖ పురోహితులు బ్రహ్మశ్రీ నాగుల దుర్గాప్రసాద్‌, అవధానం కుమార్‌శర్మ ఆధ్వర్యంలో పంచదశ రుత్వికులు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారన్నారు. 21న స్వామివారి కల్యాణం వైభవంగా జరుపనున్నట్టు పేర్కొన్నారు.

హెల్మెట్‌ ధరిద్దాం ప్రాణాలను కాపాడుకుందాం

రాయచోటి టౌన్‌ : ద్విచక్రవాహన దారులు తప్పకుండా హెల్మెట్‌ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ట్రాఫిక్‌ ఎస్‌ఐ మహమ్మద్‌ రఫీ ద్విచక్ర వాహనదారులకు సూచించారు. జిల్లా ఎస్పీ, రాయచోటి డీఎస్పీ ఆదేశాల మేరకు రాయచోటి రూరల్‌, అర్బన్‌ ఇన్‌చార్జి సీఐ తులసీరాం ఆదేశాల మేరకు శనివారం ట్రాఫిక్‌ నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

నందలూరు (రాజంపేట) : ట్రాఫిక్‌ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఏఎస్‌ఐ శంకర్‌ నాయక్‌ తెలిపారు. శనివారం స్థానిక బస్టాండ్‌ కూడలిలో పోలీసులు ఆధ్వర్యంలో వాహనదారులను పాటించాల్సిన ట్రాఫిక్‌ నియమాలు గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అతి వేగం తగ్గించాలని, ప్యాసింజర్లతో గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. పూర్తిస్థాయిలో రికార్డులు ఉండాలని తెలియజేశారు.

ఒంటిమిట్ట చెరువుకి సోమశిల బ్యాక్‌ వాటర్‌

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలో 2023 – 24 సంవత్సరానికిగాను వర్షపాతం తక్కువగా నమోదైంది. దీంతో ఒంటిమిట్ట చెరువులో నీటి మట్టం పూర్తిగా తగ్గిపోయాయి. సంబంధిత ఇరిగేషన్‌ అధికారుల ఆదేశాల మేరకు శనివారం కుడమలూరు సోమశిల వెనుక జలాల పంప్‌ హౌస్‌ నుంచి ఒంటిమిట్ట చెరువుకు సోమశిల జలాలను ట్రైల్‌ రన్‌ చేశారు. ఈ ట్రైల్‌ రన్‌ విజయవంతం కావడంతో నేడు(ఆదివారం) రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి మండలంలోని కుడమలూరులో ఉన్న సోమశిల వెనుక జలాల నుంచి ఒంటిమిట్ట చెరువుకు నీటిని విడుదల చేయనున్నట్టు తెలిపారు.

16న పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవం

చిన్నమండెం : ఈ నెల 16వ తేదీన మండల పరిధిలోని సచివాలయాలతో పాటు పలు భవనాలను ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవాలను నిర్వహించనున్నట్లు జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ దేవనాథరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బోడిరెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయం, వైఎస్‌ఆర్‌ రైతు భరోసా కేంద్రం, విలేజ్‌ క్లినిక్‌, డిజిటల్‌ లైబ్రరీల నిర్మాణాలను ఒకే ప్రాంగణంలో మోడల్‌గా సర్వాంగ సుందరంగా నిర్మింప చేశారన్నారు. నూతన భవనాల ప్రారంభోత్సవానికి ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరుకానున్నందున వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని దేవనాథరెడ్డి కోరారు.

కోడూరు వాసికి డాక్టరేట్‌ ప్రదానం

రైల్వేకోడూరు అర్బన్‌ : రైల్వేకోడూరులోని సీఎం రాచపల్లి గ్రామానికి చెందిన ఉపేంద్రరాజుకు గౌరవ డాక్టరేట్‌ శనివారం లభించింది. తిరుపతి కరకంబాడి వెంకటేశ్వర కాలేజ్‌ ఆఫ్‌ ఇంజనీరింగ్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఉపేంద్రరాజుకు ఏలూరు ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ వారు డాక్టరేట్‌ ప్రదానం చేశారు. ఇంప్లిమెంటేషన్‌ ఆఫ్‌ ఎన్‌క్రిప్షెన్‌లో డేటా వైండింగ్‌, కమ్యూనికేషన్‌ నెట్‌వర్క్‌ అనే అంశంలో పరిశోధనా వ్యాసానికి డాక్టరేట్‌ అందించారు. దీంతో పలువురు స్నేహితులు, ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

మండెం లక్ష్మీనారసింహుడి ఆలయానికి మహర్దశ

చిన్నమండెం : మండలంలోని మాండవ్యా నది తీరాన వెలసిన మండెం రాయుడిగా ప్రసిద్ధికెక్కి తాళ్లపాక అన్నమాచార్యులుచే ఆరాధించబడిన శ్రీమండెం లక్ష్మీ నరసింహస్వామికి ఎనిమిదో శతాబ్దంలో చోళులు ఆలయ నిర్మాణం చేపట్టారు. తర్వాత శ్రీ కృష్ణదేవ రాయ పాలనలో ఆలయం చుట్టూ ప్రాంగణాన్ని గోపురాలు రూపుదిద్దుకొని ఈ ప్రాంత భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. తదనంతర కాలంలో ఆలయ ప్రాశస్తి దెబ్బతింటూ వచ్చింది. పాడుబడిపోతున్న ఈ ఆలయాన్ని జీర్ణోద్ధరణతో ఆలయ రూపురేఖలను మార్చాలని స్థానికులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ దేవనాథరెడ్డి, స్థానిక ప్రజల విన్నపం మేరకు రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి రూ. 1.50 కోట్లను మొదటి విడతగా మంజూరు చేయించి ఆలయ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఆలయం పూర్వ వైభవం పొందుతుండటంతో ఎమ్మెల్యే చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

16న పనుల ప్రారంభం

కొన్ని దశాబ్దాలుగా పాడుబడి కనిపిస్తున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్‌ చైర్మన్‌ దేవనాథరెడ్డిల చేతులమీదుగా భూమిపూజ చేపట్టనున్నారు. ఇప్పటికే పనులకు సంబంధించిన టెండర్‌ ప్రక్రియ కూడా పూర్తయింది. పనుల ప్రారంభం నుంచి నిర్ణీత కాలంలో ఆలయం పనులను పూర్తి చేసేలా తగిన ప్రణాళికను సిద్ధం చేశారు. భూమిపూజ కార్యక్రమాలలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పోరాటం

రాయచోటి అర్బన్‌ : అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పోరాటం చేయనున్నట్లు ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీనివాస ఐటీఐలో ఆర్‌ఎస్‌యూ జిల్లా రెండవ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చదువుకున్న విద్యార్థులు, యువతకు సరైన ఉపాధి లేక గల్ఫ్‌ దేశాలకు వలసలు వెళుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తగ్గించాలన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రంలో నూతన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలంటూ డిమాండ్‌ చేశారు. అధికార, ప్రతిపక్షపార్టీల నేతల వ్యక్తిగత స్వార్థం వలన రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందన్నారు. విభజన హామీల అమలుకు త్వరలో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కారం కోసం నవంబరు 5 నుంచి జీపు జాతను చేపట్టనున్నట్లు తెలిపారు. హాస్టళ్లలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి వారి సమస్యలను పరిష్కరించాలంటూ కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్‌, జిల్లా నేతలు వీరాంజనేయులు, వంశీ, కిరణ్‌, మల్లేష్‌, సుకుమార్‌, సరేంద్రతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూటర్లు ఢీ : ఒకరు మృతి


ప్రమాదంలో మృతి చెందిన పి. నాగేంద్ర

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై ఎర్రగుంట్ల బస్టాప్‌ సమీపంలో శనివారం రాత్రి రెండు స్కూటర్లు ఢీ కొని పి.నాగేంద్ర (28) మృతి చెందగా అశోక్‌, భార్య అంజలిలు గాయపడ్డారు. పోలీసుల వివరాలు మేరకు మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లి పంచాయతీ ముదినేని వడ్డిపల్లికి చెందిన పి.నాగేంద్ర రాయచోటి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మోటకట్ల పంచాయతీ చెరువు ముందరపల్లికి చెందిన అశోక్‌ (40), ఆయన భార్య అంజలి ద్విచక్ర వాహనంలో రాయచోటికి వెళ్తుండగా మార్గమధ్యంలోని ఎర్రగుంట్ల బస్టాప్‌ సమీపంలోకి రాగానే రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో నాగేంద్ర అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడ్డ అశోక్‌, అంజలిలను 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు నాగేంద్రకు భార్య, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలాన్ని రూరల్‌ సీఐ తులసీరామ్‌, ఎస్‌ఐ షరీఫ్‌లు పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

మూడు గంటల్లో ఛేదించిన పోలీసులు

నందలూరు (రాజంపేట) : పొత్తపి గ్రామానికి చెందిన సాయి తేజ అనే యువతి ఈనెల 13వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఫిర్యాదు అందుకున్న పోలీసులు యువతి ఆచూకీ మూడు గంటల్లో ఛేదించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన శనివారం నందలూరు పోలీస్‌ స్టేషన్‌లో చోటు చేసుకుంది. యువతి తండ్రి నరసింహులు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి కేసు నమోదు చేసి మూడు గంటల వ్యవధిలో నెల్లూరులో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి యువతిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొని వ్యక్తి మృతి

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొనడంతో యర్రబోగుల సుబ్రమణ్యం అలియాస్‌ సురేష్‌(37) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. రైల్వేకోడూరు వీపీఆర్‌ కండ్రిక జె. శెట్టి పల్లి గ్రామానికి చెందిన సుబ్రమణ్యం ఏపీఎండీసీ నర్సరీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై రైల్వేకోడూరుకు బయలుదేరాడు. మంగంపేట జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీ కనిపించకపోవడంతో వేగంగా ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీకాంత్‌ రెడ్డి తెలిపారు.

లయన్స్‌ ఆధ్వర్యంలో అన్నదానం

రాయచోటి అర్బన్‌ : లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో శనివారం రాయచోటి పట్టణంలో అన్నదానం కార్యక్రమం జరిగింది. పట్టణానికి చెందిన ఎం.నరసింహారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, కోడలు అశోక్‌రెడ్డి, లావణ్యల ఆర్థికసౌజన్యంతో పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.ఎస్‌.హరినాథరెడ్డి, సభ్యుడు అనిల్‌ కుమార్‌రెడ్డితోపాటు ఆసుపత్రి సిబ్బందిలు పాల్గొన్నారు.